

# మా యాత్ర

దేవులపల్లి కృష్ణమూర్తి

# మా యాత్ర

## దేవులపల్లి కృష్ణమూర్తి

హైదరాబాద్ బుక్ ట్రస్టు


| | | |
|---|---|---|
| ధర | : | రూ. 60/- |
| మొదటి ముద్రణ | : | ఫిబ్రవరి 2012 |
| ముఖచిత్రం | : | ఎడ్గర్ దేగా, వాసు |
| లోపలి బొమ్మలు | : | శీలా వీర్రాజు |
| ప్రతులకు, వివరాలకు | : | హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006. ఫోన్ : 23521849 www.hyderabadbooktrust.blogspot.com |
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్, హైదరాబాద్ – 28 ఫోన్ : 23391364, 23304194 Email: anupamaprinters@yahoo.co.in |

# నక్రేకల్ నజరానా

ఇది – మేరా జిగ్రీ దోస్త్ దేవులపల్లి కృష్ణమూర్తిగారి యాత్రానుభవాల కథనం.

ఇది – ఒక్కడి ఒంటరి పర్యటన ముచ్చట కాదు. ఎందుకంటే – మూలాల్లోకి వెడితే, కృష్ణమూర్తిగారు ఏ ఒక్కరికో చెందినవాడు కాదు, అందరికీ చెందినవాడు. అలాగే, ఆయనకు అందరూ కావాలె. పంచుకోడంలో, వాటిని అర్థం చేసుకోడంలో, వీలయినంతగా ఆదుకోవడంలో వున్న ఆనందం, పరమార్థం తెలిసినవాడు. అందుకే యీ యాత్ర ఆయన చేసిన, ఆయనతో చేసిన వారందరి జీవన యానంగా మారి, సప్తవర్ణాలు, అనగా బతుకు రంగుల సంపుటిగా మనకు అందజేస్తున్నారు.

శైలీపరంగా చెప్పాలంటే, ఆయన దిగ్భ్రమ కథా కథన మార్గంలోకి వెళ్లకుండా, పాఠకుణ్ణి ఉత్ప్రేక్షల వూయలలో వూపకుండా, దర్శిస్తున్న స్థలాల, ప్రదేశాల చారిత్రక, శిల్ప సంపద ప్రాముఖ్యత, దారికిరువైపుల పరుచుకున్న రమణీయత, దారిలో పడిన కష్టనష్టాలు, సహయాత్రీకుల సంసారాల్లోని కల్లోలాలు పడుగు పేకల్లా అల్లుకుంటూ సాదా సీదా అనిపించేట్లుగా చెబుతారు. ఆయన శైలి జీవితమంత గొప్పది. బతుకంత సహజమైనది. ఇది ఆయనకెలా అబ్బిందో! పెద్దప్రశ్న.

మొదట్లో కృష్ణమూర్తిగారు నాకు బాగానే తెలుసు అనుకునే వాడిని. నాకే కాదు, ఆయనను నాలుగుసార్లు కలిసిన వారికి, మూడడుగులు వేసిన వారికి, రెండుసార్లయినా చాయ్ తాగినవారికి యిటువంటి భావమే కలుగుతుంది. ఆయన చూపే ఆత్మీయత, మరుక్షణం అనుబంధంగా మారిపోతుంది. అదే, 'ఆయన నాకు బాగానే తెలుసు' అని అంతా అనుకునే దాని వెనకవున్న మార్మికత.

ఈ కపటంలేని ఆత్మీయతా లక్షణం ఆయనలోని ఒక పార్శ్వం మాత్రమేనని ఆలస్యంగా అందరికీ తెలిసింది. ఎప్పుడంటే, అంతవరకు మనలో ఎందరోవలె, అందర్లో ఒకడిగా కలిసిమెలిసి సాగిపోయే కృష్ణమూర్తిగారు, ఒకానొక ఉదయాన, ఒక్కసారిగా 'ఆయనొక ప్రత్యేకత గల వ్యక్తి అనీ, మనమధ్యే మసలుతున్న అరుదైన రచయిత అనీ' ఆత్మకథతో బయటికొచ్చాక అందరికీ అర్థమైంది. జీవితంలో చాలా భాగం గడిచాక, ఒకరోజున హఠాత్తుగా యిటువంటి సజీవరచన చెయ్యడం యీయనకెలా సాధ్యమైందో! యిది కూడా మరో పెద్ద ప్రశ్న. సాధారణంగా జీవన విధానానికీ, రచనా శైలికీ మధ్య వుండే రేఖను యీయన ఎలా చెరిపెయ్యగలిగారో యిది కూడా యీ ప్రశ్నల పరంపరలో ఒక భాగమే.

‘ఊరు వాడ బతుకు’ పుస్తకం అందర్నీ వూగించింది. అమితాశ్చర్యం కలిగించింది. పొంగి పొర్లే ఆనందంలో ముంచింది. ప్రతిరోజూ అసంఖ్యాకంగా అనేక పుస్తకాలు విడుదలవుతున్నా, ఎడారిలో ఒయాసిస్సులా, మండుటెండలో మలయ మారుతంలా యీ పుస్తకంతోచింది. ఒక పుస్తకం మాత్రమే కాదు, ఒక సాహిత్య సంఘటనగా కూడా నిలిచింది. ఊరు వూరుగా, వాడవాడగా, బతుకు బతుకుగా అక్షరాల్లోకొస్తే యీ పుస్తకమే అవుతుంది. అంతేకాదు, చదువులు, నాగరికత, టెక్నాలజీ వీటి అంతస్సూత్ర అనుసంధాన విధానంలోని అనుసృజన మార్గం విడిచి మనం ఎంతగా అసహజమైన మనుషులమైనామో కూడా యీ పుస్తకం పరోక్షంగా తెలియజేస్తుంది. అంతేకాదు, యీ పుస్తకం ఆయన ఆత్మకథలోని ఒక భాగం మాత్రమే కాదు, ఆయన సంచరించిన ప్రాంతాలు, పరిచయం చేసిన వ్యక్తులు, సంఘటనలు, సందర్భాలు, నడయాడిన కాలాల చరిత్ర కూడా.

దేవులపల్లి వారు విశ్వవిద్యాలయాల కర్మాగారాల్లో తయారు చెయ్యబడిన రచయిత కాదు. బహుగ్రంథ అవలోచన వరవడిలోని ఇనప కచ్చడాల, అనుకరణ రచయిత కాదు. పాఠకుణ్ణి ఎలాగైనా పిల్లిమొగ్గలతో రంజింపజేద్దామనుకునే రచయిత కాదు. ఇంకా చాలా చాలా కాదు. ఆయన ఊరు వాడల రచయిత. సహజ రచయిత. సరాసరి బతుకునుండి వచ్చిన రచయిత. ఆయన లోపలికి వెడితే – దిగడానికి చక్కని మెట్లుగల దిగుడు బావి. అందులోని ప్రతిక్షణం వూటలు వూరే జీవ జలంలో – సాహిత్యం, సంగీతం, చిత్రలేఖనం, ఆధునిక సినిమాపై అనురక్తి – యీ కోణాలన్నీ సమ్మేళనమై ఆయనలో నిలిచి వెలిగే లోవెలుగులు.

యాత్ర అనగానే సుదూర గతంలో, మనదేశంలో ఎన్నో ప్రదేశాలు పర్యటించి, నాటి, సాంఘిక సాంస్కృతిక రాజకీయార్థిక సంగతులతో అమూల్యమైన విశేషాలెన్నో మనకందించిన విదేశీయులు మొదలు, మనవాడు ఏనుగుల వీరాస్వామయ్య కాశీయాత్ర వరకు ఎన్నో మనస్సులో మెదులుతాయి.

ఇటీవలి కాలంలో పెరిగిన ప్రయాణ సౌలభ్యాలవల్ల, స్థలాల వివరాలు అందుబాటులోకి రావడంవల్ల, చాలామంది భార్యాభర్తలు, ప్రేయసీప్రియులు, మిత్రులు, సంచారులు, పర్యాటకులు, యిలా ఎంతోమంది దేశీయ, విదేశీయులు ప్రసిద్ధ దర్శనీయ ప్రాంతాలకు, స్థలాలకు వెళ్లి, తరువాత తమ అనుభవాలు, ఆయా ప్రదేశాల ప్రాముఖ్యతా వివరాలతో గ్రంథాలుగా, పత్రికలలో వ్యాసాల రూపంలో మనకు అందజేస్తున్నారు. అభిలాష వున్న, అనేక కారణాలవల్ల ఆప్రదేశాలకు వెళ్లలేని వాళ్లు ఎన్నో విశేషాలు తెలిసి ఎంతో ఆనందం పొందుతున్నారు.



దేవులపల్లి కృష్ణమూర్తి ‘మా యాత్ర’ వీటికి భిన్నమైనది. విశేషమైనది. గుర్తింపదగినది.

ఆ తేడా ఏమిటంటే –

ఇతర పర్యాటకులు దర్శించిన స్థలాలు, తీర్థాలూ, ప్రాంతాలు వెళ్లి వచ్చిన తర్వాత గ్రంథాలలో, వ్యాసాలలో వాటిని మనకు చెబుతారు. మనం పాఠకులంగా వాటిని చదువుతాం. ఈ ‘యాత్ర’లో మనం కూడా దేవులపల్లి వారితోబాటు వెళ్లి వస్తాం. వారితోబాటే కష్టాలూ, నష్టాలూ, సంతోషాలూ, పరవశత్వాలూ అన్నీ మనం కూడా పొందుతాం.

ఇతర గ్రంథాలు, వ్యాసాలు రచనలుగా అక్కడనే ఆగిపోతాయి. దేవులపల్లి వారి యాత్ర పుస్తక రూపంలో వున్నా, మనల్ని తనలోకి తీసుకుంటుంది. తద్వారా మనం కూడా సహ యాత్రీకులమవుతాం.

అదెట్లనగా –

నకిరేకల్ నుంచి ఒక మినీ టూరిస్టు బస్సు ఉత్తర భారతదేశ యాత్రకై ఒక ఉదయాన బయల్దేరింది. ఇందులో ఇరవై నలుగురు యాత్రీకులున్నారు. ఇరవై రోజుల్లో ముప్ఫయ్ ప్రదేశాలు దర్శించడం వుద్దేశం. యాత్రీకులుగాక, వెంట ఒక వంట మనిషి, యిద్దరు డ్రైవర్లు వున్నారు.

ఆ మినీ బస్సులో దేవులపల్లి వారి పక్కన ఒక వూహాజనిత సీటు వుంటుంది. దానిమీద యీ పుస్తకాన్ని చదువుతున్న పాఠకుడు కూర్చుని వుంటాడు. ఆమె అయితే ఆమె వుంటుంది. కృష్ణమూర్తిగారే అతన్ని/ఆమెను లోపలికి తీసుకొచ్చి ఆసీట్లో కూర్చోబెట్టాడు.

మార్గమధ్యంలో, బస్సులోనో, ఆగినప్పుడో, అంతా భోజనాలు చేస్తున్నప్పుడో, రాత్రిపూట నిద్రరాని సమయాల్లోనో, వీలయినప్పుడు తోటి యాత్రికుల జీవితాల గురించి కృష్ణమూర్తిగారు అనునయంగా వాకబు చేస్తూవుంటారు. వాళ్లు చెబుతూవుంటారు.

పాఠకుడు దారిపొడుగునా పరిసరాలను గమనిస్తూ పరవశించడమేగాక, ఆయా దర్శనీయ స్థలాల సౌందర్యం, చారిత్రక ప్రాముఖ్యం, శిల్ప వైభవం, కృష్ణమూర్తిగారి మాటల్లో వినడమే గాక, యితర యాత్రీకులు చెబుతున్న తమ బతుకుల్లోని సాధక బాధకాలు, అల్లకల్లోలాలు దృశ్యమానంగా వింటూ వుంటాడు.

ఇలా ఒకవైపు ఆయా స్థలాల అద్భుత రమనీయం, రెండూ సమాంతరంగా కొనసాగిపోతూ వుంటాయి.

దేవులపల్లి వారు ‘ఊరు వాడ బతుకు’లో పూర్తిగా జానపద జనపథకుడిగా కనిపిస్తాడు. యాత్రలో ఆధునిక కవితాంచలాలు అందుకున్న కవనవ్య తాత్వికుడిగా

అగుపిస్తాడు. ప్రతి స్థలయాత్రకు ముందు కొన్ని కవితా వాక్యాలతో ప్రయాణం కొనసాగిస్తాడు. ఆ వుదాహృత కవులు ధన్యులు.

బాసర జ్ఞాన సరస్వతీ ఆలయం, మానవుడే మహనీయుడై పూజలందుకుంటున్న సాయి ఆలయం, జైన, బౌద్ధ, హిందూ మతాలకు చెందిన ఎల్లోరా గుహాలయాలు, తుగ్లక్ కాలం నాటి దేశ రాజధాని దౌలతాబాద్, తిరిగి అద్భుత అజంతా గుహలు, ఉదయపూర్ మందిరాలు, ఆరావళి పర్వతాల్లోని మౌంట్ అబూ, అజ్మీర్ దర్గా, జైపూర్, వికలాంగులకు ధైర్యమివ్వడమేగాక, తిరిగి నడకనిచ్చిన జైపూర్ ఫుట్, హరియానా జై హనుమాన్ ఆశ్రమం, ఢిల్లీ ఎర్రకోట, ధవళ బహాయి తామర పద్మ దేవాలయం, అక్షరధాం, హరిద్వార శక్తి రూపాలు, గురుద్వార, నైనితాల్, మధురమైన ద్వారక, ఖజురహో, ఆగ్రా తాజ్, అయోధ్య, వారణాసి విశ్వనాథ, కలకత్తా, శాంతినికేతన్, భువనేశ్వర్, కోణార్క, పూరీ జగన్నాథ దేవాలయం, చిల్కా సరస్సు, శ్రీకాకుళం అరసవిల్లి సూర్య దేవాలయం, సింహాచలం, విశాఖ రామకృష్ణ బీచ్, భీమ్లీ, అరకులోయ, అన్నవరం, భద్రాచలం.

వీటన్నింటినీ యిక్కడ ప్రత్యేకంగా పేర్కొన్నానంటే యిందులో కొన్నింటిని నేను ప్రభుత్వ అధికారిగా, కర్తవ్యంలో భాగంగా చూశాను. మరోసారి సాహితీ కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం వెళ్లినప్పుడు మరికొన్నింటిని చూశాను. వీటిపై చాలా గ్రంథాలున్నాయి. పత్రికల్లో ప్రత్యేక వ్యాసాలున్నాయి. అయితే, వాటిని విడివిడిగా చదవడం వేరు. దేవులపల్లి వారు చెప్పిన పద్ధతిలో తెలుసుకోడంవేరు. అన్ని కోణాల్నుండీ వివరిస్తూ అన్నింటినీ ఒక పుస్తకంలో చేర్చి పూలగుత్తివలె మన చేతుల్లో పెట్టడం వేరు. ఆ పరిమళమే వేరు. ఆ విధానమే పట్టలేని ఆనందాన్నిస్తుంది. ఆపుకోలేని యాత్రోత్సాహాన్నిస్తుంది.

ఇదే సందర్భంలో నేనొక అతి ముఖ్యమైన విషయం చెప్పదలచుకున్నాను. ఇంతకు ముందే చెప్పినట్లు, ఈ పుస్తకం వల్ల దేవులపల్లి వారి వెంట వుండి మనం కూడా తనివితీరా యాత్ర చేస్తాం. ఆయా మహత్తర ప్రదేశాలను కనులారా చూస్తాం. జీవితాంతం స్మృతిపేటికలో దాచుకుంటాం. ఇది ఒక పార్శ్వం. మరొకటి, అతి ముఖ్యమైనదీ, యీ యాత్రల్లో పాల్గొన్న వారంతా, దేవులపల్లి వారు యితరుల సంభాషణలో చెప్పిన వ్యక్తులంతా, పరోక్షంగానే అయినా, మనకు అతి సన్నిహితంగా పరిచయమవుతారు.

ఉదాహరణకి  రామనాథం – గీత, వెంకటరెడ్డి – రేవతమ్మ, సాయిరెడ్డి, – సుగుణమ్మ, రామాచారి – శారదాంబ, చంద్రమౌళి – లక్ష్మమ్మ, సూరేపల్లి మారయ్య – కళమ్మ, అయితరాజు దేవయ్య – పూర్ణమ్మ, భల్లం రాంరెడ్డి – విమలమ్మ, ఈ దంపతులు గాక, ఒక్కరొక్కరుగా  మాయాచారి, కందిమళ్ల రాధమ్మ, సూర్యం, దొంత తిర్పతమ్మ,



లలిత, పూజ, సత్యం, రంగారెడ్డి, మగ్దూం వీళ్లేగాక, కృష్ణమూర్తిగారి సంభాషణలో ప్రస్తావనలో కొచ్చిన వాళ్ల చిన్నప్పటి క్లాస్‌మేట్స్, సహోద్యోగులు, రిటైరై ఎక్కడెక్కడో వున్న వాళ్లు, చనిపోయిన వాళ్లు, మిత్రులు, బంధువులు మొదలైనవారందరి గురించి సంఘటనలతో సహా హత్తుకునేట్లు చెప్పడం వల్ల వీళ్లంతా మన మనసులో చెరిగిపోని చోటు చేసుకుంటారు.

మరొక మాట. ఇంతకుముందే చెప్పినట్లు అనిపించినా, నిజంగా మరొకసారి చెప్పవలసిన విషయం, కృష్ణమూర్తిగారి శైలి నిరలంకారమైనది. గాలివలె, వానవలె, ఎండవలె, మొత్తం ప్రకృతివలె సహజమైనది. వాక్య నిర్మాణంలో వుపయోగించే నుడి నానుడులవల్ల కృత్రిమత్వం పారిపోతుంది. బతుక్కి దగ్గర చేస్తుంది. మమేకత్వం ఎంతగానంటే, పాఠకుడు టూరిస్టు బస్సులో వుండి ప్రయాణించడమే కాదు, దారిలో యాత్రీకులు పడే బాధలు, ఆనందాలు అన్నీ అతనూ అనుభవిస్తాడు. ఉదాహరణకి రాత్రుళ్లు బసలో దోమలు అతన్ని కూడా కుడతాయి. రాళ్లమీద నడుస్తున్నప్పుడు అతనూ కాలు జారి కింద పడతాడు. రాజస్థాన్ నుండి వెళుతున్నప్పుడు హజారీ ఫిల్లింగ్ స్టేషన్ పెట్రోల్ బంక్ ఆవరణలో నిద్రపోతుండగా జరిగిన దొంగతనంతో షాకు అవుతాడు. ఆ చీకట్లో తానూ యితరులతోబాటు పోయిన బ్యాగులు, బట్టలు, డబ్బు కోసం చుట్టు ప్రక్కల నడిచి, నడిచి వెతుకుతాడు. ఇలా ప్రతి సందర్భంలో, సన్నివేశంలో మమేకమవుతాడు. ఈ పాఠకుడు ఎవరో కాదు, యీ పుస్తకం చదివే నువ్వు, నేను, మనమే.

ఇంక –

ఈ పుస్తకం చదవడం పూర్తయ్యాక, నాలో కొన్ని కోర్కెలు చిగురించాయి. వాటిని తీర్చగలిగిన వారూ, చేసిపెట్టగలిగినవారూ కృష్ణమూర్తిగారే. అందుకని, వాటిని వారి దృష్టికి  తీసుకువస్తాను.

ఒకటి : గతంలో నేనూ యిందులోని కొన్ని యాత్రాస్థలాలు చూసివున్నా, వీటన్నింటినీ తిరిగి కృష్ణమూర్తిగారితోనే చూడాలని వుంది. ఏమంటారో వినాలి.

రెండు : ఈ యాత్ర యింక కొద్ది సేపట్లో ముగుస్తుందనగా, వీరి టూరిస్టు బస్సుకింద ఓ ఆవుపడింది. వెంటనే కొందరు చుట్టూ పోగయ్యారు. అది చనిపోలేదని ఎంతగా చెబుతున్నా, చనిపోయిందని గొడవచేసి, వాళ్లు మూడువేల రూపాయిలు పట్టుకుపోయారు. విచారణ చేసి, నిజంగానే ఆ ఆవు చనిపోలేదని దేవులపల్లి వారి ద్వారా వినాలని వుంది.

మూడు : ఈ యాత్రలో పాల్గొన్నవారు  రామనాథం నుండి మగ్దూం వరకు ఎవరు, ఎప్పుడు కృష్ణమూర్తిగారికి తటస్తపడినా, నేను వారిక్షేమం కోరుతున్నానని నా తరఫున వారికి చెప్పాలని కోరుతున్నాను.

నాలుగు : ఈ యాత్రలో మానవ సంబంధాల మధ్య పటిష్టతకు పరాకాష్టగా నిలిచిన సంబంధం, ఒంటరివారుగా మిగిలిపోయిన సూర్యం, లలితలను పెళ్లికి ఒప్పించడం. యాత్ర ముగిసిన వెంటనే సూర్యం, లలితలు పెళ్లి చేసుకున్నారని దేవులపల్లి వారు చెబితే నాకు సంతోషంగా వినాలని వుంది.

ఐదు : నా సోదరీ, కృష్ణమూర్తిగారి సహచరి కమల గారికి నా నమస్కారాలు తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

చివరిగా -

'మా యాత్ర' కృష్ణమూర్తిగారికి రాజకీయ, సాంఘిక, సాహిత్యోద్యమ కాలాలతో పరిచయం వుంది. తన అనుభవాల దృష్టితో వాటి గురించి కూడా గ్రంథస్థం చెయ్యవలసిందిగా కోరుతున్నాను.

ఈ యాత్ర ఆయన రచనా యాత్రగా కొనసాగుతుందని ఆశిస్తున్నాను.

**తాజా కలం:**

చలంగారి రచనవల్ల భీమ్లీ కొందరికి యాత్రా స్థలం అయినట్లే, రాబోయే రోజుల్లో దేవులపల్లి కృష్ణమూర్తిగారి రచనలు, వాటిలో పరిచయం చేసే సజీవ వ్యక్తులవల్ల నక్రేకల్ కూడా ఒక యాత్రాస్థలం అవుతుందేమో!

హైదరాబాద్ **-నగ్నముని**
ది. 15-12-2011

# 1

***నాలక్ష్యం దిశగా ఒంటరిగా***
***సాగిపోతున్నాను, కాని***
***మార్గంలో జనంతోడయ్యి***
***మహాయాత్రగా మారింది.***

ఎండలు మండిపోతున్నాయి. కరెంటు వస్తుంది, పోతుంది. ఒకటే ఉడకపోత, గాలిలేదు. బయట కూర్చుందామంటే మంట గాలి. అవస్థగా వుంది.

ఆ ఎండలో ఇద్దరు వ్యక్తులు స్కూటరుమీద వచ్చిండ్రు.

'కృష్ణమూర్తిగారు మీరేనా'

'అవును, రాండి. కరెంటు లేదు. వరండాలోనే కూర్చుందాం!' అంటూ కూర్చోబెట్టి మంచినీళ్లు ఇచ్చిన. వారిని నేను ఇంతకు ముందు చూచినట్లు లేదు.

తన పేరు మారోజు రామాచారి అని, ప్రక్కనున్నవారిని చంద్రమౌళిగారని పరిచయం చేసుకుండ్రు. ఇద్దరు రిటైర్డ్ టీచర్లమని చెప్పుకుండ్రు.

'మేము, ఇంకొందరము, మొత్తం ఇరవైనల్గురము కలిసి, మినీ టూరిస్టు బస్సు బుక్ చేసుకొని ఉత్తర భారత దేశయాత్ర చేయాలనుకున్నం. అందరం రిటైర్డ్ ఉద్యోగులమే. ఇద్దరు ముగ్గురు వ్యవసాయదారులున్నరనుకోండి. ఇందులో మొదట వస్తామన్న ఒక జంట కారణాంతరాలవల్ల విరమించుకున్నరు. ఇంకెవరినన్నా చేర్చుకుందామనే ప్రయత్నంలో తిరుగుతుంటే, మీకు యాత్రలు చేయటంలో ఆసక్తి వుందని తెల్సింది.

ఇరవై రోజులపాటు యాత్ర. వంటమనిషిని మాట్లాడినం. అయిన ఖర్చులు సమానంగా వేసుకుందాం. ఖర్చులన్ని వ్రాస్తం. అందాజుగా మనిషి ఒక్కంటికి పదివేలు అవుతుందని అనుకుంటున్నం' అని చెప్తూ ....

'ఈ నెల ఇరవైఆరున, ఉదయం రెండుగంటలకు బస్సు నకిరేకల్‌నుండి బయలుదేరుతుంది. బాసర, అజంతా, ఎల్లోర, అజ్మీర్ దర్గా, జైపూర్, ఢిల్లీ, అక్కడినుండి గంగా పుష్కరాలకు కాశీకి చేరాలని. అటు నుండి కలకత్తా, భువనేశ్వర్, కోణార్క్, పూరి నుండి విశాఖ చివరగా భద్రాచలంతో యాత్ర ముగుస్తుంది. మొత్తం ముప్పయి యాత్రాస్థలాలని దర్శించాలని అనుకుంటున్నం'.

వాళ్ళు చెప్పిన వాటిలో చాలాకాలం నుండి చూద్దాం చూద్దాం, అనుకుంటూ చూడకుండా పోయినవి అజంతా, కలకత్తా, కోణార్క్ వున్నాయి. సరే! ఇది బాగానే వుందనిపించింది. మీకు సాయంత్రంలోగా చెబుతానని పంపించిన.

నా భార్య కమల, వాళ్లు వచ్చి మాట్లాడినవన్నీ విన్నది. రిటైర్ అయిన ఈ పదమూడేండ్ల నుండి, ఇల్లే స్వర్గమంటూ ఎక్కడికి పోకుండా పడివున్నం. అందరూ రిటైర్ అయిన వాళ్లే కదా. యాత్రలు చేస్తే పుణ్యం, పురుషార్థం వుంటుందంటూ చెప్పుకొచ్చింది. ఈ విషయం రామాచారిగారికి చెప్పిన.

యాత్రలకు కావలసిన అన్ని సామాన్లు, సర్దిపెట్టుకున్నం. ఉదయమే రెండు గంటలకు బస్సు మీ ఇంటిముందుకొస్తుందని రామాచారిగారు ఫోను చేసిండు. ఎదురు చూడంగ చూడంగ నాల్గు గంటలకు వచ్చింది. మేమే చివరి వాళ్ళం. అందుకని మాకు చివరి సీట్లొచ్చినయి.

మా మినీ బస్సుకు టూ ప్లస్ వన్ సీట్లున్నయి. చివరన మాత్రం నాల్గు సీట్లున్నయి. మా ప్రక్కన కూర్చున్నవారు రామనాథం వారి భార్య గీత అని పరిచయం చేసుకుండ్రు. ముందు సీట్లో కూర్చున్నది వెంకట్‌రెడ్డి ఆయన భార్య రేవతమ్మ. వారి ముందు సీట్లో కూర్చున్నది సాయిరెడ్డి వారి భార్య సుగుణమ్మ. ముగ్గురూ రిటైర్డ్ టీచర్లే.

బస్సు సాగిపోతున్నది. నార్కట్‌పల్లి దాటి చిట్యాల వచ్చేవరకు ముందర బస్సులు, లారీలు అన్నీ ఆగిపోయి వున్నయి. యాక్సిడెంటు అయ్యింది. ట్రాఫిక్ జామ్ అయ్యిందన్నరు. కాలక్షేపంకోసం ఆమాట ఈమాట మాట్లాడుకుంటుండ్రు. సత్యసాయిబాబ మరణించిన విషయం మాట్లాడుతూ...

'అంత డబ్బు కూడబెట్టిండు. వెండి బంగారమైతే లెక్కేలేదు. అందులో వున్నదెంతో, పోయిందెంతో ఎవరెవరు పంచుకుండ్రో! అని, ఆ డబ్బు, బంగారమంతా విదేశీ భక్తులు ఇచ్చిందేగదా' అని సాగుతుందా ముచ్చట.

'అరే! ఇరవై సంవత్సరాల క్రితం ఈ డబ్బు వ్యవహారాలు అడిగినందుకే ఆ ఆశ్రమంలో నల్గురు యువకులు అన్యాయంగా హత్యకు గురి అయ్యిండ్రు. దాన్ని గురించి ఏ కేసూ లేదు. అడిగేనాథుడే లేడాయె! ఇంకెన్ని ఘోరాలు జరిగినయో లెక్కేలేదు. అంతా డబ్బు మాయ'.

అంతలోనే వెంకట్‌రెడ్డి, సాయిరెడ్డితో 'మనం సూర్యాపేటలో చదువుకుంటున్నప్పుడు సాయిబాబ దొరోరి గఢిలో దిగిండని ఊరంతా పోయి చూచివచ్చిండ్రు. రెండోనాడో, మూడోనాడో, ఆ గఢిలో ఏదో గోల జర్గిందని, దానితో దొరాయన తుపాకి పట్టుకొని వెంట బడితే, ఖమ్మం పారిపోయిండని అనుకుండ్రు. జ్ఞాపకముందానే' అని అంటే 'నాకంత జ్ఞాపకం లేద'న్నడు.

'అవును నాకు జ్ఞాపకముందని' నేనందుకున్నా. అయితే 'వెంకట్‌రెడ్డిగారూ, మీరప్పుడు ఏం చదువుతుంటిరి'.



'తొమ్మిదిలో వుంటి. అది 1956 అనుకుంటా'.

'మాది హెచ్చెస్సి 1958 బ్యాచి' అంటూ సాయిరెడ్డి.

'నాది కూడా అదే బ్యాచి' రామనాథం.

'అయితే, మనమంతా ఒకే బ్యాచన్నమాట' అంటూ నేను.

'మనకు రాందాసుగారు హెడ్‌మాస్టర్‌గా వుండిరి'.

ఇంతలోనే దేవకమ్మ కల్పించుకుంటూ 'పాత దోస్తులందరు ఒక్కకాడనే కల్సిండ్రే' అంటూ నవ్వింది.

నేను సాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రామనాథం సమవయస్కులమని తేలిపోయింది. వెనుకో ముందో అందరం 1998లో రిటైర్ అయినవాళ్లం.

'అయితే సాయిరెడ్డిగారూ, మీరు ట్రైనింగ్ అయినంక టీచర్ పోస్టుకు పోయిండ్రా'.

'కాదే, మన హెడ్‌మాస్టర్ రాందాస్‌గారు ప్రమోషన్‌మీద డి.ఇ.ఓ.గా పోయిండ్రు గదా. నేను, వెంకట్‌రెడ్డి ఒక్కూరోల్లం. రిజల్టు వచ్చినంక వారిని కల్సి దరఖాస్తు పెట్టుకుంటే, అన్‌ట్రేన్‌డ్ టీచర్‌గా పోస్టింగ్ ఇచ్చిండ్రు. తర్వాత ట్రైనింగ్ అయినం. నకిరేకల్ చుట్టు పక్కలనే చేస్తూ రిటైర్ అయినం' అని చెప్పుకొచ్చిండు.

రామనాథంగారేమో తనకు హెచ్చెస్సిలో వయస్సు తక్కువ పడ్డదని వెంటనే జాబుకు పోలేకపోయిన్నని చెప్పిండు. ఇలా మేం నల్గురం చిన్ననాటి ముచ్చట్లు అవో ఇవో మాట్లాడుకుంటూ పోతున్నం.

బాసరకు చేరేవరకు మధ్యాహ్నం రెండయ్యింది. గోదావరిలో స్నానం చేద్దామని పోయినోల్లు, అక్కడంతా బురదగా వుందని తిరిగివచ్చిండ్రు.

ఐఏటి రామయ్యగారి పుణ్యాన బాసర దేవాలయానికి ప్రాముఖ్యత పెరిగింది.

దేవాలయం ప్రక్కన చెట్ల నీడన మా సత్యం వంట చేయడం మొదలుపెట్టిండు. ఈ లోగా మేము 'సరస్వతిదేవి'ని దర్శించుకుందామని పోయినం. అక్కడ కొందరు చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తుండ్రు. అంతలోనే–

మాణిక్యవీణా ముపలాలయంతీం
మదాలసాం మంజుల
వాగ్విలాసాం
మహేంద్ర నీలద్యుతి కోమలాంగీం
మాతంగ కన్యాం మనసా స్మరామి

ఘంటసాల పాడుతున్నట్లుగా అనిపించి వెనుకకు తిరిగి చూసిన. చారి, ముకుళిత హస్తాలతో కండ్లు మూసుకొని పాడుతుండు.

'అరె నీకు తెల్వదు గదూ. మన మాయాచారి చక్కగా పాటలు, పద్యాలు పాడ్తడు!'

'ఎంత బాగా పాడినవుబై, నేను ఘంటసాల గొంతు ఇక్కడ వినిపిస్తుందేందిరా' అని అనుకున్న.

'తను మనం పాడమన్నప్పుడు పాడడు. తనకు పాడాలనిపిస్తేనే పాడ్తడు. ఈ మధ్యనే తెలుగు పండిట్‌గా రిటైర్ అయ్యిండు. నాకన్నా పదేండ్లు చిన్ననుకో. చందుపట్ల అయ్యగార్లందరూ పండితులే'.

'ఇలాంటి గాయకుడు మన వెంటరావడం మంచిదయ్యింది. అప్పుడప్పుడు పాటలు వినొచ్చు'.

'తప్పకుంట సార్' మాయాచారి.

జగత్ప్రసిద్ధమైన వాగ్దేవి ఆలయాలలో కాశ్మీరు తర్వాత, బాసర జ్ఞాన సరస్వతి ఆలయం పేర్కొనదగింది. వ్యాస మహర్షి ఈ ఆలయాన్ని నిర్మించిండని ఒక గాథ ప్రచారంలో వుంది. వ్యాసపురి – వ్యాసర్, బాసరగా రూపాంతరం చెందిందనే వాదం వుంది. మన రాష్ట్రంలోని వారే కాకుండా ఇరుగు పొరుగు రాష్ట్రాల వారు సైతం పసిపిల్లలకు 'అక్షరాభ్యాసం' చేయించడానికి ఈ క్షేత్రాన్ని సందర్శించడం సంప్రదాయంగా వస్తుంది. ఇక్కడి సరస్వతిదేవి విగ్రహం ఇసుకరాయితో చేయడం విశేషం.

ఎన్నో విద్యాసంస్థలు నెలకొల్పడానికి సరిపోను స్థలం, అహ్లాదకరమైన వాతావరణం. పక్కన గలగలపారే గోదావరి వుంది. అయినా టైగర్ ప్రాజెక్టుపై వున్న ప్రేమ చదువుల ప్రాజెక్టుపై లేకపోవడం క్షమించరాని నేరం. 'అంగట్లో అన్ని వున్నయి గాని అల్లుని నోట్లో శని వుంది'

భోజనాలప్పుడు, టీలు త్రాగెటప్పుడు మిగతా వారు పరిచయం అయ్యింద్రు. మొదటగా మా ఇంటికి వచ్చి, యాత్రకు ప్రతిపాదనలు పెట్టిన రామాచారి, వారి భార్య శారదాంబ. భార్యాభర్తలిద్దరూ మోకాళ్లనొప్పులతో బాధపడ్తుంద్రు.

చంద్రమౌళి రిటైర్డ్ టీచరు. ఆయన భార్య లక్ష్మమ్మ, నా భార్యకు చిన్ననాటి నుండి తెల్సు. అక్కా అక్కా అని పిలుస్తుంది. రెండుసార్లు ఉత్తర భారత దేశయాత్ర చేసిన అనుభవముంది.

సూరెపల్లి మారయ్య రిటైర్డ్ టీచరు. ఆయన భార్య కళమ్మ. మూడో సీట్లో కూర్చున్నది, అయితరాజు దేవయ్య, రిటైర్డ్ ఎలక్ట్రిసిటి లైన్‌మన్. మంచి మాటకారి. వాలంటరీ రిటైర్‌మెంటు తీసుకుండు. అందరిలో చిన్నవాడు. ఆయన భార్య పూర్ణమ్మ.

రెండోసీట్లో కూర్చున్నది, భల్లం రాంరెడ్డి వారి భార్య విమలమ్మ. సి.పి.యం పార్టీ సభ్యులు. పక్కనున్న సింగిల్‌సీట్లో కూర్చున్నది కందిమళ్ళ రాధమ్మ. వితంతువు.



మూడో సీట్లో కూర్చున్నది సూర్యం. ఒంటరివాడు, వ్యవసాయ దారుడు. యాభైఏండ్లు వుండొచ్చు.

ముందు వరుసలో కూర్చున్నది. దొంత తిర్పతమ్మ. డెబ్బయి ఏండ్లకు పైబడే వుంటయి. విధవరాలు, నెత్తంతా ముగ్గుబుట్టయ్యింది. ఆమె పక్కన కూర్చున్నామె తిర్పతమ్మ కూతురు లలిత, ముప్పై అయిదేండ్లు వుండొచ్చు. వితంతువు, ప్రయివేటు పాఠశాలలో టీచరుగా పనిచేస్తుంది. చిన్నమ్మాయిపేరు పూజ. లలిత కూతురు. ఏడెనిమిదేండ్లుంటయి.

డ్రైవరు పక్క సీటులో కూర్చుంది సత్యం. వంటమనిషి. పైవారందరిని మొట్ట మొదటిసారిగా చూస్తున్న.

# 2

**సర్వమానవ సమానత్వం, సరే,**
**అది నీ మూలతత్వం**
**అమానుష పైశాచికత్వం,**
**అదే ఎదురౌతున్న సత్యం**

రాత్రంతా ప్రయాణం. తెల్లవారగట్ల నాల్గున్నరకు 'షిరిడి' చేరుకున్నం. మా బస్ డ్రైవర్ నకిరెకల్ ప్రాంతంవాడే. పేరు రంగారెడ్డి. బస్సులో వున్న చాలామందికి పరిచయమే. రెండో డ్రైవరు మగ్దూం కాస్త చెవిటివాడు. చెప్పింది వెంటనే వినడు. బండి ఎత్తేయకుండా నడుపగలడు. అదీ అతని నైపుణ్యం.

సత్రాలు దొరుకుతవేమోనని వెతికినం. దొరికేటట్లు లేదు. అందరం, కామన్ బాత్‌రూంలోనే స్నానాలు ముగించినం. క్యూలో నిల్చొని సాయి దర్శనం చేసుకునేవరకు ఓ గంటయ్యింది.

'షిరిడి సాయి మహాత్మ్యం గూర్చి చాలామంది చాలా చాలా విధాలుగా చెప్పుకుంటారుగదా! ఎంతవరకు నిజమో తెలియదుగాని, నాకు తెలిసిన విషయం చెప్తా వినండి'.

'దేవుడు లేదు, దయ్యంలేదు అనేటోడివి, నువ్వు చెప్తున్నవా' అంటూ నా భార్య కమల.

'అందుకే గదా చెప్తున్నది' అంటూ మొదలు పెట్టిన.

'మాస్నేహితుడు రంగారావు అనే వాడుండే – ఇప్పుడు కూడా వుండనుకో. అతడు మహా తెలివైనోడు. సంగీతమంటే ప్రాణం. ఇంతటి తెలివిగల్లోనికి తాగుడు అలవాటయ్యింది. ఆఫీసర్లు విసిగిపోయి దూర ప్రాంతానికి బదిలీ చేసింద్రు.

నాకొకనాడు, బస్‌స్టాండులో కన్పించిండు. బట్టలన్ని నలిగిపోయి వున్నయి. రాత్రి తాగిన వాసన, గుప్పున వస్తుంది. కనుగుడ్లు లావయ్యి ఎర్రబడ్డయి. మనిషి చిక్కిపోయిండు.

'ఏంటి రంగారావ్, ఇట్లయినవేంది?'

'ఏం లేదు సార్. రాత్రి కాస్త ఎక్కువయ్యింది. నేను ఆరోగ్యంగానే వున్న. బస్సొచ్చిందంటూ' వెళ్లిపోయిండు.

'అరే! పాడయిపోతుండేంది' అని అనుకున్న. మళ్లీ చాలా సంవత్సరాల తర్వాత ఓ పాట విషయమై అడుగుదామని అతని ఆఫీసుకు పోయిన. మనిషి చాలా



మారిపోయిండు. ఎంతో ఆప్యాయంగా పలకరించిండు. ఆశ్చర్యపడటం నావంతయ్యింది. ఆమాట యీమాట మాట్లాడి,

పోరా బాబు పో
పోయి చూడు ఈ లోకం పోకడ
వున్న ఊరు కాదన్నావు
ఊరు విడిచి పోతున్నావు

అనే పాట ఎవరు వ్రాసింద్రు, వాటి వివరాలు చెప్పవైతివి అంటే –

'అదాసార్! ఆత్రేయ వ్రాసిండు. యమ్మేస్ రామారావు పాడిండు. దీక్ష సినిమాలోనిది' అంటూ చెప్పిండు.

వుండలేక 'రంగారావ్ నువ్వు ఇంత మారిపోతవని అనుకోలేదు ఇది ఎట్ల జరిగింది'.

రామన్నపేటకు బదలి అయిన తర్వాత, ఆఫీసులోనే వుంటుండేవాణ్ణి. నా వ్యవహారమంతా చూస్తున్న మా అటెండరు ఒకనాడు,

'ఏమి అనుకోకండి సార్ ఈ రోజు గురువారం. స్నానం చేసిన తర్వాత సాయిబాబ పటానికి ఊదు బత్తీలు వెలిగించి దండం పెట్టుకోండి. మీలో చాలా మార్పు వస్తుంది' అని చెప్పిండు.

సరే పోయేదేముందని, అతడు చెప్పినట్లే చేసిన. తర్వాత నా పనిలో నేనుండిపోయిన. సాయంత్రం అయ్యింది. తాగాలనిపించలేదు. హొటల్‌కు పోయిన. నన్ను చూచి హొటల్‌వాడు ఆశ్చర్యపోయిండు. భోజనం చేసి పడుకున్న. హాయిగా నిద్రపట్టింది. గాఢ నిద్రపోయి ఎన్నేళ్ళయ్యిందో! దేనికైనా టైం రావాలిగద. అంతే. ఆ రోజు నుండి తాగుడు జోలికి పోలేద'న్నడు.

అదీ విషయం అని ముగించిన.

'అరే! ఇది నిజంగ జర్గిందా!' సాయిరెడ్డి

'మరేమనుకున్నరు, అంతా సాయి మహిమ' తిర్పతమ్మ

'ఇదంతా మానసిక రుగ్మతమ్మా. మనం గట్టిగా పట్టుపడితే అంతా సాధ్యమైతది. పట్టుదల వుండాలె' సూర్యం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1006**

* * *